ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తమిళనాడు

TAMILNADU

బుధవారం 28 ఆగస్టు 2024

విదేశీ పెట్టుబడుల సమీకరణే లక్ష్యంగా

సీఎం స్టాలిన్ అమెరికా పయనం

చెన్నై, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): విదేశీ పెట్టుబడుల సమీకరణే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మంగళవారం రాత్రి అమెరికా పయనమయ్యారు. ఆయనతోపాటు అధికారుల బృందం కూడా వెళ్ళింది. ఈ నెల 29న శాన్‌ఫ్రాన్సిస్కోలో జరుగనున్న పెట్టుబడిదారుల సమావేశంలో స్టాలిన్ ప్రసంగించనున్నారు. ఆ తర్వాత సెప్టెంబర్ 2న అక్కడి నుంచి చికాగో నగరానికి వెళ్తారు. అమెరికాలో విస్తృతంగా పర్యటించనున్న స్టాలిన్ బహుళజాతి కంపెనీల ప్రతినిధులను కలుసుకుని రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు కోసం ఆహ్వానించనున్నారు. ఈ పర్యటనలోనే ఆయన 'ఫార్చ్యూన్ 500' సంస్థ ఉన్నతాధికారులతో భేటీ కానున్నారు. సెప్టెంబర్ 7న చికాగో నగరంలోని ప్రవాస తమిళులను, తమిళ సంఘాల ప్రతినిధుల సమావేశంలో స్టాలిన్ ప్రసంగిస్తారు. సెప్టెంబర్ 14 వరకూ ఆయన పలు నగరాల్లో పర్యటించిన వివిధ కంపెనీల ఉన్నతాధికారులు, ప్రతినిధులతో సమావేశమై పెట్టుబడుల సమీకరణ కోసం చర్యలు చేపట్టనున్నారు.



కరుణానిధి సమాధివద్ద మంత్రులు, ఎంపీ కనిమొళితో కలిసి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

పారిశ్రామికాభివృద్ధే లక్ష్యం...

రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలన్నదే తన ప్రధాన లక్ష్యమని, ఆ దిశగానే అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని స్టాలిన్ పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడులను సమీకరణలో విజయం సాధించామని, ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సింగపూర్, జపాన్, స్పెయిన్ దేశాల్లో పర్యటించి విదేశీ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామని, ఈ యేడాది జనవరిలో చెన్నైలో జరిగిన విదేశీ పెట్టుబడిదారుల మహానాడు కూడా విజయవంతమైందని తెలిపారు. కొత్త పరిశ్రమలను నెలకొల్పటం ద్వారా మూడేళ్లలో 31 లక్షలమందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని స్టాలిన్ ప్రకటించారు. ఇదిలా ఉండగా అమెరికా పర్యటనకు బయలుదేరటానికి ముందు దివంగత ముఖ్యమంత్రి కరుణానిధి సమాధివద్ద మంత్రులు, ఎంపీ కనిమొళితో కలిసి సీఎం స్టాలిన్ నివాళులర్పించారు.

అభివృద్ధి పనులు సవ్యంగా సాగాలి...

తాను అమెరికా పర్యటనలో ఉన్నప్పటికీ రాష్ట్రంలో అభివృద్ధి పనులపై రోజూ పరిశీలిస్తానని, మంత్రులు, వివిధ శాఖల అధికారులు అభివృద్ధి పథకాలు, పనులు సవ్యంగా సాగేలా చర్యలు తీసుకోవాలని స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. అటు పరిపాలనా వ్యవహారాలు, ఇటు పార్టీ వ్యవహారాలు సవ్యంగా సాగేందుకు మంత్రులు, పార్టీ సీనియర్ నేతలు తోడ్పడాలని కోరారు.



చెన్నై ఎయిర్‌పోర్టులో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం స్టాలిన్

అన్నాడీఎంకేను తాకి చూడండి

ఎన్ని జన్మలెత్తినా పార్టీని నాశనం చేయలేరు

అన్నామలైపై మాజీ మంత్రి జయకుమార్ ధ్వజం

చెన్నై, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): కోట్లాదిమంది ప్రజలు, కార్యకర్తల ఆదరాభిమానాలున్న అన్నాడీఎంకేను నాశనం చేస్తామంటూ శపథాలు చేసినవారంతా అడ్రస్ లేకుండా పోయారని, ఈ విషయం తెలిసినా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తమ పార్టీ నేతపై అదే పనిగా విమర్శలు చేస్తున్నారని మాజీ మంత్రి డి. జయకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో మంగళవారం ఉదయం మీడియా సమావేశంలో అన్నామలైపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అన్నాడీఎంకేని తాకి చూడండి ఆ తర్వాత ఏమవుతారో తెలుస్తుంది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నామలై, ఆయన తాతముత్తాతలు తలచుకున్నా అన్నాడీఎంకేని ఏమీ చేయలేరని, తాకితే నాశనం కావటం ఖాయమన్నారు. అన్నామలైని రాష్ట్ర ప్రజలంతా ఫ్యూజ్ పోయిన బల్బుగానే భావిస్తున్నారని విమర్శించారు. రెండు కోట్ల మంది కార్యకర్తలు కలిగిన పార్టీకి చెందిన ముఖ్యమంత్రి స్టాలిన్ అమెరికాకు, అన్నామలై లండన్‌కు ఇంచుమించూ ఒకే సమయంలో వెళ్తున్నారని, వీరిద్దరూ విదేశాలకు వెళ్ళి రహస్యంగా మంతనాలు జరుపబోతున్నారని జయకుమార్ ఆరోపించారు.



వణుకుతున్న అన్నాడీఎంకే...

అన్నామలైని చూసి అన్నాడీఎంకే నేతలంతా వణికిపోతున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరు నాగరాజన్ విమర్శించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసిన ఆయన అన్నామలై రాజకీయ ప్రవేశం చేయగానే ముందుగా అన్నాడీఎంకేకు భయంపట్టుకుందని తెలిపారు. ఎడప్పాడి పళనిస్వామిని అన్నాడీఎంకేలో పలుకుబడి కలిగిన నేతగా రాష్ట్ర ప్రజలు అంగీకరించడమే లేదన్నారు. ఇకనైనా అన్నాడీఎంకే నేతలు అన్నామలైని విమర్శించటం మానుకోవాలని ఆయన హితవుపలికారు.

నేడు లండన్ వెళ్లనున్న అన్నామలై

పెరంబూర్, ఆగస్టు 27: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై బుధవారం లండన్ బయలుదేరి వెళ్తున్నారు. లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ రాజకీయాంశాల ప్రత్యేక కోర్సుకు వివిధ దేశాలకు చెందిన 40 మంది ఎంపికయ్యారు. వారిలో భారత్ దేశం నుంచి ఎంపికైన 12 మందిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఒకరు. ఆ కోర్సుకు ఎంపికైన వారు అక్కడే ఉండి చదువుకొనేలా అన్ని ఖర్చులను ఆ విశ్వవిద్యాలయ నిర్వాహకులనే భరిస్తారు. ఆరు నెలల క్రితమే అన్నామలై లండన్ పర్యటన ఖరారైంది. ఆ మేరకు అన్నామలై నగరం నుంచి బుధవారం లండన్ బయల్దేరి వెళ్లనున్నారు. నవంబరు నెలాఖరులో ఆయన నగరానికి తిరిగిరానున్నారు.

లండన్ వెళ్ళినా పాలకుల తప్పిదాలు ఎండగడతా...

ఇదిలా ఉండగా తాను లండన్ వెళ్ళినా డీఎంకే ప్రభుత్వ తప్పిదాలను ఎండగడతానని అన్నామలై చెప్పారు. మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నాడీఎంకే నేత ఎడప్పాడిపై తాను చేసిన విమర్శలను ఉపసంహరించుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. లండన్‌లో ఉన్నా పార్టీ వ్యవహారాలపై ప్రత్యేక దృష్టిసారిస్తానని తెలిపారు. పెట్టుబడుల సమీకరణ కోసం ముఖ్యమంత్రి స్టాలిన్ అమెరికా పర్యటనకు బయలుదేరటం మంచిదేనని, అయితే అంతకు ముందు విదేశాల్లో పర్యటించిన సందర్భంగా పెట్టుబడులను ఏమేరకు సమీకరించారన్న వివరాలపై శ్వేత పత్రం విడుదల చేయాలని తాను కోరినా పట్టించుకోలేదని ఆరోపించారు. అమెరికా పర్యటనలోనైనా స్టాలిన్ రాష్ట్రానికి పెట్టుబడులను భారీగా సమీకరిస్తే మెచ్చుకుంటానని అన్నామలై చెప్పారు.

'ఎం పాక్స్' చికిత్సపై వైద్యులకు శిక్షణ

- జీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు
- మంత్రి ఎం.సుబ్రమణ్యం

పెరంబూర్, ఆగస్టు 27: రాష్ట్రంలో ఎంపాక్స్ వ్యాప్తి లేదని, అయినా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఎంపాక్స్ బాధితుల ప్రత్యేక వార్డును మంగళవారం మంత్రి సుబ్రమణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ... ఎంపాక్స్ బాధితులకు చికిత్స అందించేలా చెన్నై, కోయంబత్తూర్, తిరుచ్చి, మదురై ప్రభుత్వాస్పత్రుల్లో ప్రత్యేక వార్డులు ఏర్పాటుచేశామన్నారు. ఈ వ్యాధి వ్యాప్తిని అడ్డుకొనేలా ముందస్తు చర్యలు, బాధితులకు మెరుగైన చికిత్సలందించేలా అన్ని వసతులు సిద్ధం చేశామని తెలిపారు. రాష్ట్రంలోని విమానాశ్రయాల్లో ప్రయాణికులకు థర్మల్ స్కాన్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే, విమానాశ్రయాల్లో ప్రత్యేక వైద్యబృందాలను కూడా సిద్ధంగా ఉంచినట్టు తెలిపారు. ఎంపాక్స్ లక్షణాలు, వ్యాప్తి, చికిత్స తదితరాలపై 200 మంది వైద్యులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో ఎంపాక్స్ వ్యాప్తి లేదని, అయినా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టామని, ప్రైవేటు ఆస్పత్రులను కూడా పరిశీలిస్తున్నామన్నారు. రాష్ట్రంలో డెంగ్యూ వ్యాప్తి నియంత్రణలో ఉందన్నారు. అయినా, రుతుపవాల సీజన్ కావడంతో డెంగ్యూ వ్యాప్తి అధికమయ్యే అవకాశాలున్నాయన్న వైద్యనిపుణుల హెచ్చరికలతో, అన్ని రకాల ముందస్తు నివారణ చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో జీసీసీ మేయర్ ప్రియ, ఆసుపత్రి నిర్వాహకులు పాల్గొన్నారు.



ప్రత్యేక వార్డును ప్రారంభిస్తున్న మంత్రి ఎం.సుబ్రమణ్యం



అన్ని వసతులతో ఏర్పాటైన ప్రత్యేక వార్డు

ఎయిర్‌పోర్ట్‌లో ఒకే సమయంలో

రెండు రన్‌వేలపై ల్యాండింగ్

- 10 శాతం విమానసేవల పెంపు



చెన్నై, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనాంబాక్కం విమానాశ్రయంలో ఇటీవల చేపట్టిన మరమ్మతుల కారణంగా రెండు రన్‌వేలను ఒకే సమయంలో ఉపయోగించడానికి వీలుకావటంతో రెండో రన్‌వేలో నడిపే విమానాల సంఖ్య 10 శాతానికి పెరిగింది. ఈ విమానాశ్రయంలో రెండు రన్‌వేల్లో రోజూ విమానాలు దిగుతుంటాయి. మొదటి రన్‌వే 3.66 కి.మీ.ల పొడవు, రెండో రన్‌వే 2.89 కి.మీ.ల పొడవు ఉన్నాయి. మొదటిది మెయిన్ రన్‌వే కాగా, దీనిపై భారీ విమానాలు ల్యాండింగ్, టేకాఫ్ అవుతుంటాయి. రెండో రన్‌వేపై 76 సీట్ల కెపాసిటీ కలిగిన విమానాలు, ప్రైవేటు విమానాలు ల్యాండింగ్ టేకాఫ్ అవుతుంటాయి. ఈ రెండు రన్‌వేల్లో ఒకే సమయంలో విమానాలు దిగటానికి, బయలుదేరటానికి అనువుగా మరమ్మతులు చేపట్టాలని భారత విమానయాన సంస్థ నిర్ణయించింది. ఆ మేరకు ఈ విమానాశ్రయంలో ల్యాండింగ్ అయ్యే విమానాలు ఒక రన్‌వే నుంచి మరొక రన్‌వేకు వెళ్లేలా టాక్సీవే అనే అనుబంధ మార్గాలుండేవి. ఈ టాక్సీ వే 'బి' అనే బ్రావో మొదటి రన్‌వేకు నేరుగా వెళ్లకుండా వంపు ఉండేది. ఈ కారణంగా ల్యాండింగ్ అయ్యే, టేకాఫ్ అయ్యే విమానాలు టాక్సీవేలో వేగంగా వెళ్లలేని పరిస్థితులు ఉండేవి. ఈ అంశాన్ని నిశితంగా పరిశీలించిన విమానయాన సంస్థ ఉన్నతాధికారులు ఈ టాక్సీవే బి- ని వంపుగా కాకుండా సరళరేఖలా మార్చే పనులు ఇటీవలే ముగిశాయి. దీంతో రెండో రన్‌వేలో విమానా సేవల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. మరి కొద్ది నెలల్లో మరిన్ని విమానాలు రెండో రన్‌వేలో నడుపనున్నారు. దీంతో విమానాశ్రయంలో ప్రయాణికుల రాకపోకలు మెరుగవుతాయని, కాలయాపనకు తావుండదని విమానాశ్రయ అధికారులు ప్రకటించారు.

తమిళ కాంగ్రెస్‌లో త్వరలో భారీ మార్పులు

- టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై



సెల్వపెరుంతగైని సత్కరిస్తున్న పార్టీ నేతలు

చెన్నై, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గ్రామీణ స్థాయి నుంచి అభివృద్ధి పరిస్తేనే ప్రజల మధ్య గౌరవం పెరుగుతుందని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై పేర్కొన్నారు. సెంట్రల్ చెన్నై జిల్లా కమిటీ పార్టీ నిర్వాహకుల సమావేశం రాయపేటలో మంగళవారం ఉదయం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సెల్వపెరుంతగై మాట్లాడుతూ పార్టీలోనే వాక్స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం ఉందని, అదే సమయంలో పార్టీ నేతలు తమ అభిప్రాయాలను అనువైన సమయంలోనే వెల్లడించాలని, పార్టీ అధిష్టానం, కూటమికి నాయకత్వం వహిస్తున్న డీఎంకేకు నష్టం కలిగించేలా ఇష్టానుసారం మాట్లాడకూడదన్నారు. పార్టీ బలోపేతానికి అధిష్టానం తనకు ఆదేశాలిచ్చిందని, ఆ మేరకు త్వరలో పార్టీలో భారీ మార్పులు చేయబోతున్నామని, దశాబ్దాలుగా పార్టీకి సేవలందిస్తున్నవారికి పార్టీ పదవులు తప్పకుండా లభిస్తాయని, పార్టీ శ్రేణులంతా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి పార్టీని అభివృద్ధి పరచేందుకు పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది రాజశేఖరన్, మాజీ ఎమ్మెల్యే జేఎం ఆరాన్, సొర్ణసేతురామన్, రామమోహన్, రంగభాష్యం, దళపతి భాస్కర్, జియావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పరువునష్టం కేసును చట్టప్రకారం ఎదుర్కొంటా

- ప్రత్యేక కోర్టుకు తెలిపిన ఈపీఎస్



ప్రత్యేక కోర్టు నుంచి బయటకు వస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

చెన్నై, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ఎంపీ దయానిధి మారన్ తనపై వేసిన పరువు నష్టం దావాను చట్ట ప్రకారం ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఉదయం చెన్నై కలెక్టరేట్ వద్దనున్న ప్రత్యేక కోర్టులో విచారణకు ఆయన హాజరయ్యారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా సెంట్రల్ చెన్నై ఎంపీ దయానిధి మారన్ నియోజకవర్గ అభివృద్ధి నిధుల వినియోగంలో అక్రమాలకు పాల్పడ్డారని ఈపీఎస్ ఆరోపించారు. దీంతో దయానిధి మారన్ పరువునష్టం దావా వేశారు. ఆ కేసు విచారణ ప్రత్యేక కోర్టులో మేజిస్ట్రేట్ జయవేల్ సమక్షంలో మంగళవారం ఉదయం జరిగింది. ఆ సందర్భంగా ఈపీఎస్ హాజరై కేసును చట్ట ప్రకారం ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు మేజిస్ట్రేట్‌కు తెలిపారు. దీంతో మేజిస్ట్రేట్ కేసు తదుపరి విచారణ సెప్టెంబర్‌కు 19కి వాయిదా వేశారు.

హాజరు నుంచి మినహాయించండి...

వయోభారం, అనారోగ్యం దృష్ట్యా ఈ కేసు విచారణకు తాను స్వయంగా హాజరు కాకుండా మినహాయించేలా ఉత్తర్వులివ్వాలని కోరుతూ ఈపీఎస్ పిటిషన్ వేశారు. తనకిప్పుడు 70 యేళ్లని, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా, ప్రధాన ప్రతిపక్ష నేత బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాల్సి ఉందని, ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యక్ష విచారణకు మినహాయింపు ప్రకటించాలని ఈపీఎస్ ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలంటూ దయనిధి మారన్‌కు మేజిస్ట్రేట్ ఉత్తర్వు జారీ చేశారు.

సమస్యల పరిష్కారం కోసం ఆందోళన

- వందలాదిమంది రవాణా శాఖ మాజీ ఉద్యోగుల అరెస్ట్

పెరంబూర్, ఆగస్టు 27: కరువు భత్యం పెంపు సహా 13 డిమాండ్లను ఆమోదించాలని కోరుతూ, రాష్ట్రవ్యాప్తంగా 9 ప్రాంతాల్లో రవాణా శాఖ మాజీ ఉద్యోగులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఇందులో భాగంగా పల్లవన్‌సాలైలో ఉదయం నుంచే పెద్దసంఖ్యలో కార్మికులు గుమిగూడారు. ఆ ప్రాంతంలోని ఎంటీసీ డిపో నుంచి కార్మికులు ర్యాలీగా బయలేర్దారు. కార్మికుల సమస్యలు పరిష్కరించేలా ముఖ్యమంత్రి చర్యలు చేపట్టాలంటూ కార్మికులు నినాదాలు చేశారు. ర్యాలీగా వస్తున్న కార్మికులను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసుల తీరును ఖండిస్తూ కార్మికులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. రాస్తారోకోలో పాల్గొన్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ విషయమై రాష్ట్ర రవాణా శాఖ మాజీ కార్మికుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కె.కర్సన్ మాట్లాడుతూ 2015 నుంచి రవాణా శాఖ మాజీ కార్మికులకు కరువు భత్యం పెంచలేదన్నారు. ఈ విషయమై కోర్టును ఆశ్రయించగా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని, దానిని కూడా ప్రభుత్వం ఖాతరు చేయడం లేదని ఆరోపించారు. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు కనిష్ట పింఛన్‌గా రూ.7,850 ఇస్తుండగా, రవాణా శాఖ మాజీ ఉద్యోగులకు మాత్రం రూ.3,050 అందుతుందన్నారు. తాజాగా 30,000 మంది కార్మికులు పదవీవిరమణ చేశారని, వారికి కుటుంబ పింఛన్, బీమా వర్తింపు తదితరాలు ఇవ్వలేదన్నారు. 2022 డిసెంబరు నుంచి ఇప్పటివరు పదవీవిరమణ చేసిన కార్మికులకు తలా రూ.20 లక్షల బకాయిలుంచారని తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.



రాస్తారోకోలో రవాణా శాఖ మాజీ ఉద్యోగులు

సమాచార దర్శిని

కోవై, తిరుచ్చిలో కలైంజర్ సెంటినరీ లైబ్రరీలు

ఐసిఎఫ్, ఆగస్టు 27: కోయంబత్తూర్, తిరుచ్చిలో కలైంజర్ సెంటినరీ లైబ్రరీల ఏర్పాటుకు స్థలాన్ని ఎంపిక చేయనున్నట్టు గ్రంథాలయ శాఖ అధికారులు తెలిపారు. మదురైలో పుదునత్తం రోడ్డులో 2,13,338 చ.అ విస్తీర్ణంలో నిర్మించిన కలైంజర్ శతజయంతి గ్రంథాలయాన్ని గత ఏడాది జూలై 15వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో, తిరుచ్చి, కోవైలో ఈ గ్రంథాలయాల ఏర్పాటుకు స్థలాల ఎంపిక ప్రక్రియ ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.

పెరంబూర్ మార్గంలో బెంగళూరు-థానాపూర్ రైళ్లు

ఐసిఎఫ్, ఆగస్టు 27: కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి చెన్నై పెరంబూర్ మీదుగా బీహార్ రాష్ట్రం థానాపూర్ వెళ్లే ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగించినట్లు దక్షిణ రైల్వే తెలిపింది. థానాపూర్- బెంగళూరుకు ప్రతి బుధవారం వెళ్లే ప్రత్యేక రైలు ఈ నెల 28 నుంచి సెప్టెంబరు 4వ తేది వరకు, బెంగళూరు-థానాపూర్‌కు ప్రతి శుక్రవారం వెళ్లే ప్రత్యేక రైలు ఈ నెల 30 నుంచి సెప్టెంబరు 6వ తేది వరకు పొడిగించారు.

నేడు, రేపు చెన్నై-తిరుపతి మెము రైళ్ల రద్దు

పెరంబూర్, ఆగస్టు 27: అరక్కోణం యార్డ్‌లో మరమ్మతుల కారణంగా చెన్నై సెంట్రల్-తిరుపతి మెము రైళ్ల సేవలు ఈ నెల 28,29, సెప్టెంబరు 1వ తేది పూర్తిగా రద్దయ్యాయి. ఈ మేరకు దక్షిణ రైల్వే మంగళవారం ప్రకటన విడుదల చేసింది.

- నెం.06727 డా.ఎంజీఆర్ సెంట్రల్ నుంచి ఉదయం 9.50 గంటలకు తిరుపతికి బయల్దేరే మెము, మరుమార్గంలో నెం.06728 తిరుపతి నుంచి మధ్యాహ్నం 1.35 గంటలకు డా.ఎంజీఆర్ సెంట్రల్‌కు బయల్దేరే మెము రైళ్లు బుధ, గురువారాల్లో పూర్తిగా రద్దు.
- నెం.16054 డా.ఎంజీఆర్ సెంట్రల్ నుంచి ఉదయం 10.10 గంటలకు తిరుపతి బయల్దేరే ఎక్స్‌ప్రెస్, మరుమార్గంలో తిరుపతి నుంచి మధ్యాహ్నం 2.25 గంటలకు చెన్నై బయల్దేరే ఎక్స్‌ప్రెస్ రైళ్లు సెప్టెంబరు 1వ తేది పూర్తిగా రద్దు.

హాకీ పోటీలకు ఆహ్వానం

ఐసిఎఫ్, ఆగస్టు 27: హాకీ పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులను చెన్నై జిల్లా హాకీ సంఘం ఆహ్వానిస్తోంది. ఈ సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా డివిజన్ హాకీ లీగ్ పోటీలు జరుగుతుయి. ఆ ప్రకారం, సెప్టెంబరు మొదటి వారంలో ఎగ్మూర్ రాధాకృష్ణన్ హాకీ స్టేడియంలో పోటీలు ప్రారంభం కానున్నాయి. ఔత్సాహికులు పేరు నమోదు, వివరాలకు 6383146742 నెంబరుకు సంప్రదించాలని సంఘ కార్యదర్శి ఉదయకుమార్ తెలిపారు.

అందుబాటులోకి కొత్త బస్సులు

ఐసిఎఫ్, ఆగస్టు 27: ప్రభుత్వ రవాణా సంస్థల్లో మూడు సంవత్సరాల్లో 1,796 కొత్త బస్సులు అందుబాటులోకి వచ్చాయని ఆ శాఖ అధికారులు తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 1,000 కొత్త బస్సుల కొనుగోలుకు ప్రభుత్వం రూ.420 కోట్లు కేటాయించింది. అప్పట్లో 833 బస్సులు అందుబాటులోకి రాగా, 2023-24లో 3,000 బస్సుల కొనుగోలుకు రూ.1,535 కోట్లు కేటాయించింది. ఈ నెల 23వ తేది వరకు 1,796 కొత్త బస్సులు అందుబాటులోకి వచ్చాయని, మిగిలిన 503 బస్సులు నవంబరులో రానున్నాయని అధికారులు తెలిపారు.

నేడు ఫార్ములా-4 కార్ రేస్ కేసు విచారణ

పెరంబూర్, ఆగస్టు 27: నగరంలో ఈ నెల 31 నుంచి ఫార్ములా 4 కార్ రేస్ నిర్వహణకు రాష్ట్ర క్రీడాభివృద్ధి కమిషన్ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇదివరకు గత డిసెంబరులో జరగాల్సిన ఈ పోటీలు వాయిదాపడిన నేపథ్యంలో, ఈ నెల 31, సెప్టెంబరు 1వ తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో, ఈ ఫార్ములా కార్ రేస్‌కు వ్యతిరేకంగా బీజేపీ అధికార ప్రతినిధి బీఎస్ఎస్ ప్రసాద్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేయడంతో పాటు అత్యవసర కేసుగా పరిగణించి విచారించాలని కోరారు. దీంతో, బుధవారం ఈ కేసు విచారిస్తామని మద్రాసు హైకోర్టు తాత్కాలిక న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం తెలియజేసింది.

నేడు ఉలగళందపెరుమాళ్ ఆలయ కుంభాభిషేకం

ఐసిఎఫ్, ఆగస్టు 27: కాంచీపురం ఉలగళందపెరుమాళ్ ఆలయ మహా కుంభాభిషేకం బుధవారం జరుగనుంది. ఈ ఆలయానికి 2007 మార్చి 25న కుంభాభిషేకం జరిగింది. ఇటీవల ఆలయ జీర్ణోద్ధరణ పనులు పూర్తయ్యాయి. మహాసంప్రోక్షణ నేపథ్యంలో ఆదివారం నుంచి పలు కార్యక్రమాలు జరిగాయి. సోమవారం ఉదయం కుంభస్థాపన, సాయంత్రం పూర్ణాహుతి చేశారు. మంగళవారం ఉదయం, సాయంత్రం హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి కుంభాభిషేకం, సాయంత్రం 5 గంటలకు స్వామివారి ఊరేగింపు జరుగనుంది.

పాఠశాల విద్యార్థులకు పోటీలు తప్పనిసరి

ఐసిఎఫ్, ఆగస్టు 27: పాఠశాలల్లో అన్ని సంఘాలతో కూడిన పోటీలు నిర్వహించి, విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. పాఠశాలల్లో విద్యార్థుల ప్రతిభ మెరుగుపరిచేలా వానవిల్ సంఘం, సాహిత్య సంఘం, పర్యావరణ సంఘం, క్విజ్ సంఘం వంటివి పనిచేస్తున్నాయి. వీటి ద్వారా 1 నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులకు టైంటేబుల్‌కు తగినట్లు పాఠశాల, తాలూకా, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు ఏప్రిల్ వరకు తప్పనిసరిగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఆవిన్‌లో మూలికల పాలు విక్రయం

పెరంబూర్, ఆగస్టు 27: మూలికల పాలు విక్రయించే అంశంపై ఆవిన్ సంస్థ పరిశోధనలు చేపట్టింది. ప్రభుత్వ ఆధీనంలోని ఆవిన్ సంస్థ రైతుల నుంచి సేకరించిన పాలతో పాటు వెన్న, పెరుగు, మజ్జిగ, ఐస్‌క్రీమ్ సహా 200 పైగా ఉత్పత్తులు విక్రయిస్తోంది. ఆవిన్ ఉత్పత్తులకు ప్రజాదరణ పెరిగిన నేపథ్యంలో, ఆవిన్ ఆధ్వర్యంలో మూలకల పాలు, శొంఠి కాఫీ, అవ్వగంధ పాలు అందించనున్నట్లు పాడిపరిశ్రమల శాఖ మంత్రి మనో తంగరాజ్ ఇటీవల ప్రకటించారు. ప్రస్తుతం మూలికల పాలు విక్రయాలపై అధికారులు పరిశోధన చేపట్టారు. సాంకేతిక బృందాన్ని ఏర్పాటుచేసిన ఆవిన్ శాంపిల్స్ సేకరించి పరిశీలిస్తోంది. ప్రస్తుతం ఆవిన్ రోజ్‌మిల్క్‌కు ప్రజాదరణ లభించడంతో త్వరలో మూలికల పాలు సహా మూడు ఉత్పత్తులు అందించేలా పరిశోధనలు జరుగున్నాయని ఆవిన్ అధికారులు తెలిపారు.

ఇంజనీరింగ్‌లో 63,843 మందికి తాత్కాలిక సీట్లు

పెరంబూర్, ఆగస్టు 27: రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో అడ్మిషన్లకు సంబంధించి ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ జరుగుతోంది. మూడో విడత కౌన్సెలింగ్ ఈ నెల 23వ తేది ప్రారంభం కాగా, జనరల్ విభాగంలో 93,059 మంది విద్యార్థులకు కాల్ లెటర్స్ పంపారు. ఈ నేపథ్యంలో, జనరల్ విభాగంలో 58,889 మంది, 7.5 శాతం రిజర్వేషన్ కోటాలో 4,954, మొత్తం 63,843 మందికి సోమవారం వరకు తాత్కాలిక సీట్లు కేటాయించారు. సీట్లు ధ్రువీకరించిన వారికి బుధవారం అలాట్‌మెంట్ ఆర్డర్ అందజేస్తామని రాష్ట్ర ఇంజనీరింగ్ విద్యార్థుల అడ్మిషన్ కార్యదర్శి పురుషోత్తమన్ తెలిపారు.

జిల్లాకు ఒక వైద్య కళాశాల ప్రారంభిస్తున్నారు

డీన్‌లను నియమించారా...?

- రాష్ట్రప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న



హైకోర్టు మదురై డివిజన్ బెంచ్

పెరంబూర్, ఆగస్టు 27: రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాలల్లో శాశ్వత డీన్‌లను నియమించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై అఫిడవిట్ దాఖలుచేయాలని రాష్ట్రప్రభుత్వానికి హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. మదురై కేకే నగర్‌కు చెందిన వెరోనికా మేరి హైకోర్టు మదురై బెంచ్‌లో దాఖలుచేసిన పిటిషన్‌లో... రాష్ట్రంలో మదురై సహా 36 ప్రభుత్వ వైద్యకళాశాలలున్నాయి. రాష్ట్రంలో రెండవ అతి పెద్ద ఆస్పత్రి అయిన మదురై రాజాజీ ఆస్పత్రికి ప్రతిరోజు సుమారు 9,000 మంది ఔట్ పేషెంట్లు, మరో 3,000 మంది ఇన్‌పేషంట్లుగా ఉన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో డీన్ బాధ్యత ప్రధానమైనది. మదురై రాజాజీ ఆసుపత్రి డీన్ గత ఏప్రిల్ 30వ తేది పదవీవిరమణ చేశారు. ప్రస్తుతం సీనియర్ ప్రొఫెసర్ తాత్కాలిక డీన్‌గా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో మదురై-, కరూర్, తిరుచ్చి, విరుదునగర్, రామనాథపురం, పుదుకోట, కన్నియాకుమారి, తేని ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రుల్లో డీన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కావున మదురైతో పాటు ప్రభుత్వ వైద్యకళాశాలల్లో శాశ్వత డీన్‌లను నియమించేలా ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌ను మంగళవారం న్యాయమూర్తులు ఆర్.సుబ్రమణియన్, న్యాయమూర్తి ఎల్.విక్టోరియా మేరీలతో కూడిన ధర్మాసనం విచారించి... జిల్లాకు ఒక వైద్యకళాశాల ప్రారంభిస్తున్నారు... కానీ డీన్‌లను నియమించడం లేదు. డీన్‌లను నియమించనప్పుడు కొత్త ఆస్పత్రులు ఎందుకు ప్రారంభిస్తున్నారు, ఈ పిటిషన్‌పై రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి, వైద్య విద్య డైరెక్టర్, బదులు పిటిషన్ దాఖలుచేయాలని ఉత్తర్వులు జారీచేసి తదుపరి విచారణ సెప్టెంబరు 3వ తేదీకి వాయిదావేశారు.

వేలానికి 3,000 వాహనాలు...

పోలీసుల సాయం కోరిన జీసీసీ

పెరంబూర్, ఆగస్టు 27: గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని రోడ్లపై దీర్ఘకాలంగా పార్కింగ్ చేసిన 3,000 వాహనాలను కార్పొరేషన్ స్వాధీనం చేసుకుంది. ఈ వాహనాలను వేలం వేసేందుకు సిద్ధమైన కార్పొరేషన్, ఈ వాహనాలకు సంబంధించి ఏమైనా కేసులున్నాయా అంటూ నగర పోలీసు శాఖకు లేఖ రాసింది. నగరంలోని రోడ్ల పక్కన ఏళ్ల తరబడి పార్కింగ్ చేస్తున్న వాహనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. 2018లో నగరంలో డెంగ్యూ వ్యాప్తి అధికమైన నేపథ్యంలో, ఈ వ్యాధి నిరోధక చర్యల్లో భాగంగా రోడ్ల పక్కనున్న శిథిలమైన వాహనాలను కార్పొరేషన్ తొలగించింది. అనంతరం అప్పటి కార్పొరేషన్ కమిషనర్‌గా వ్యవహరించిన టి.కార్తికేయన్ చర్యలతో సుమారు 5,000 వాహనాలు వేలం వేశారు. ఈ నేపథ్యంలో, రోడ్ల పక్కనున్న వాహనాలను వేలం వేస్తామని ప్రస్తుత మేయర్ ప్రియ కార్పొరేషన్ సమావేశాల్లో ప్రకటించారు. ఆ ప్రకారం, సుమారు 3,000 వాహనాలను కార్పొరేషన్ కార్మికులు తొలగించారు. ఈ వాహనాలు వేలం వేయాలని నిర్ణయించిన కార్పొరేషన్, వాటికి ఏమైనా కేసుల్లో ఉన్నాయా అనే వివరాలు తెలియజేయాలని పోలీసు శాఖకు లేఖ రాసింది.



రోడ్డు పక్కన వాహనాలు తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది (ఫైల్‌ఫొటో)

రవాణా కార్మికులతో వేతన సంఘం చర్చలు

అడయార్, ఆగస్టు 27: రవాణా కార్మికులతో 15వ వేతన సంఘం చర్చలు జరిపింది. క్రోంపేటలోని రవాణా శాఖ శిక్షణా ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన చర్చల్లో రవాణా శాఖ కార్యదర్శి ఫణీంద్ర రెడ్డి, రవాణా డివిజన్లకు చెందిన మేనేజింగ్ డైరెక్టర్లు, ఉన్నతాధికారులు, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఎల్‌పీఎఫ్, ఐఎన్‌టీయూసీ తదితర కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. చర్చల అనంతరం కార్మిక సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ, ఈ చర్చల్లో అందరికీ ఆమోదయోగ్యమైన సానుకూల నిర్ణయం తీసుకుంటామని అభిప్రాయపడ్డారు. కాగా, రాష్ట్ర రవాణా శాఖలో సుమారుగా 1.20 లక్షల మంది కార్మికులున్నారు. వీరికి వేతన ఒప్పందం ప్రతి మూడేళ్ళకు ఒకసారి జరుగుతుంది. 13, 14 వేతన ఒప్పందాలు జరిగాయి. ఇపుడు 14వ వేతన సంఘం కాలపరిమితి ముగియడంతో 15వ వేతన సంఘంపై చర్చలు ప్రారంభించారు.

టీవీకే జెండాలోని ఏనుగు బొమ్మలు తొలగించాలి

- ఈసీకి బీఎస్పీ వినతి

పెరంబూర్, ఆగస్టు 27: నటుడు విజయ్ ప్రారంభించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) జెండాలోని ఏనుగుల బొమ్మలు తొలగించేలా ఉత్తర్వులు జారీచేయాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయ కార్యదర్శి ఈసీకి రాసిన లేఖలో అంబేడ్కర్ సిద్ధాంతాల బాటలో పయనించే బీఎస్పీ పార్టీ జెండాలో ఏనుగు చిహ్నం ఉందన్నారు. తమకు కేటాయించిన చిహ్నాన్ని అస్సోం, సిక్కిం మినహా ఇతర రాష్ట్రాల్లో వినియోగించరాదని ఎన్నికల నిబంధన విధించినట్లు పేర్కొన్నారు. కానీ, నటుడు విజయ్ పార్టీ జెండాలో రెండు ఏనుగులున్నాయని, ఇది ఎన్నికల నిబంధన ఉల్లంఘనేనని తెలిపారు. జాతీయ పార్టీ చిహ్నాన్ని వినియోగించిన విజయ్‌పై చర్యలు చేపట్టడంతో పాటు అతని జెండాలోని ఏనుగుల చిహ్నాలు తొలగించేలా ఉత్తర్వులు జారీచేయాలని బీఎస్పీ ఈసీని కోరింది.

పెన్నైయారులో బయల్పడిన రాతి పనిముట్లు



ఐసిఎఫ్, ఆగస్టు 27: కడలూరు జిల్లా బన్రూటి సమీపంలోని తెన్ పెన్నయారులో ప్రాచీన కాలం నాటి రాతి పనిముట్లు లభ్యమయ్యాయి. పురావస్తు పరిశోధకులు ఈ ప్రాంతంలో కొద్దిరోజులుగా పరిశోధనలు చేపడుతున్నారు. ఇప్పటికే వివిధ రకాల వస్తువులు లభించగా, సోమవారం ఒరల బావులు, బంకమట్టి బొమ్మలు, ప్రమిదలు, రాతి నాణేలు, చోళుల, ఆంగ్లేయుల కాలం నాటి రాగి నాణేలు, రాతి గొడ్డళ్లు, పూర్వీకుల సమాధులు కనుగొన్నారు. ఆ వస్తువుల్లో ఉన్న రాతి గొడ్డలి 8 వేల సంవత్సరాల క్రితం నాటిదని, 10 సెం.మీ పొడవు, 4.5 సెం.మీ వెడల్పు కలిగి ఉందని పరిశోధకులు తెలిపారు.

ఇద్దరు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు

పెరంబూర్, ఆగస్టు 27: టీఎన్‌పీఎస్సీ అధ్యక్షుడిగా నియమితులైన ఎస్కే. ప్రభాకర్ నిర్వహిస్తున్న రెవెన్యూ అడ్మినిస్ట్రేషన్, అడ్మినిస్ట్రేటివ్ రీఫార్మ్స్, విజిలెన్స్ కమిషనర్ బాధ్యతలను బి.అముద, కె.మణివాసన్‌లకు అప్పగించారు. అడిషినల్ చీఫ్ సెక్రటరీ హోదాలో ఉన్న మాజీ రెవెన్యూ కమిషనర్ ఎస్కే. ప్రభాకర్ ఇటీవల తమిళనాడు పబ్లిక్ సర్వీస్ సెలక్షన్ కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) ఛైర్మన్‌గా నియమితులు కాగా, తాజాగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో, ఎస్కే. ప్రభాకర్ శాఖలను ఇద్దరు ఐఏఎస్ అధికారులకు అదనంగా అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

విచారణకు హాజరైన తిరుమావళవన్

పెరంబూర్, ఆగస్టు 27: డీపీఐ అధ్యక్షుడు, ఎంపీ తిరుమావళవన్ మైలాడుదురై జిల్లా సెషన్స్ కోర్టులో హాజరయ్యారు. మైలాడుదురైలో 2003లో నిర్వహించిన పార్టీ ర్యాలీలో ఘర్షణ చెలరేగిన వ్యవహారంపై తిరుమావళవన్ సహా 42 మందిపై పోలీసులు కేసు నమోదుచేశారు. కేసుకు సంబంధించి కోర్టు పీడీ వారెంట్ జారీచేసిన నేపథ్యంలో, తిరుమావళవన్ కోర్టుకు హాజరయ్యారు. అనంతరం ఈ కేసు విచారణ సెప్టెంబరు 11వ తేదీకి వాయిదావేస్తూ న్యాయమూర్తి విజయకుమారి ఉత్తర్వులు జారీచేశారు.

పాఠశాలకు గ్రీన్ బోర్డు వితరణ



పాఠశాల నిర్వాహకులకు గ్రీన్ బోర్డు అందజేస్తున్న రోటరీ సభ్యులు

వేలూరు, ఆగస్టు 27: గుడియాత్తం రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ.లక్ష విలువైన గ్రీన్ బోర్డును మంగళవారం రోటరీ ప్రతినిధులు అందజేశారు. గుడియాత్తం రోటరీ సంఘ అధ్యక్షుడు కన్నన్, జిల్లా రోటరీ సంఘ మాజీ గవర్నర్ పళని పాఠశాల నిర్వాహకులకు బోర్డు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ సంఘ నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ తనిఖీలు



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఆగస్టు 27: ఆనైకట్టు పంచాయతి యూనియన్ పరిధిలోని పల్లికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సుబ్బులక్ష్మి మంగళవారం పరిశీలించారు. ఇన్‌పేషంట్ల విభాగానికి వెళ్లిన కలెక్టర్, ఆస్పత్రిలో అందుతున్న చికిత్స వివరాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆపరేషన్, మందుల విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆనైకట్టు తహసీల్దార్ వేండా, వైద్యులు షాలిని, సౌమ్య సిద్దార్థ తదితరులున్నారు.

చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



క్రిస్టియన్‌పేటలోని చెక్‌పోస్ట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మదివానన్

వేలూరు, ఆగస్టు 27: జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన మదివానన్ మంగళవారం ఆంధ్ర-తమిళనాడు సరిహద్దు క్రిస్టియన్‌పేటలోని చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేశారు. ఆంధ్రా నుంచి వచ్చే వాహనాలు, రాష్ట్రం నుంచి వెళ్లే వాహనాలను ఎస్పీ ఆపి తనిఖీ చేశారు. ఆంధ్రా నుంచి రాష్ట్రానికి చట్టవిరుద్ధంగా గంజాయి, మత్తుపదార్థాల తరలింపును అడ్డుకొనేలా చెక్‌పోస్ట్ వద్ద అదనపు నిఘా ఏర్పాటుచేస్తున్నట్లు ఈ సందర్భంగా ఎస్పీ మదివానన్ తెలిపారు.

ఘనంగా అన్నై మీరా కళాశాల స్నాతకోత్సవం



విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తున్న ఇళయ పెరుమాళ్

వేలూరు, ఆగస్టు 27: స్థానిక అన్నై మీరా ఇంజనీరింగ్ కళాశాల 8వ స్నాతకోత్సవం మంగళవారం జరిగింది. వేడుకలకు కళాశాల వ్యవస్థాపక అధ్యక్షుడు రాందాస్ అధ్యక్షత వ హించగా, కళాశాల ప్రిన్సిపాల్ గోపినాథన్ ఆహ్వానం పలికారు. సెక్రటరీ దామోదరన్, ట్రస్టీ సీతాలక్ష్మి, డైరెక్టర్లు ప్రశాంత్, కిషోర్‌కుమార్, డా.అరవింద్ తదితరులు పాల్గొన్నారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా నాగాలాండ్ రాష్ట్రానికి చెందిన ఎన్ఐటీ డైరెక్టర్ ఇళయపెరుమాళ్ పాల్గొని, 271 మంది విద్యార్థినీ, విద్యార్థులు డిగ్రీలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ మాజీ కౌన్సిలర్ దామోదరన్, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ బ్రేక్ బైండింగ్ నుంచి పొగ

పెరంబూర్, ఆగస్టు 27: పశ్చిమ బెంగాల్ నుంచి తిరునల్వేలి వైపు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ వేలూరు సమీపిస్తున్న తరుణంలో బ్రేక్ బైండింగ్ నుంచి పొగ వచ్చింది. దీంతో డ్రైవర్ రైలు నిలిపివేశారు. పొగ ఆగిన తర్వాత 15 నిమిషాలు ఆలస్యంగా రైలు బయల్దేరి వెళ్లింది. ప్రయాణికుడు ఎమెర్జెన్సీ చైన్ లాగడంతో బ్రేక్ బైండింగ్‌లో పొగ వచ్చిందని రైల్వే అధికారుల విచారణలో తెలిసింది.

పాస్‌పోర్ట్ వెబ్‌సైట్ మూడు రోజుల బంద్

పెరంబూర్, ఆగస్టు 27: సాంకేతికలోపం కారణంగా పాస్‌పోర్ట్ వెబ్‌సైట్ ఈ నెల 29 రాత్రి 8 నుంచి సెప్టెంబరు 2 ఉదయం 6 గంటల వరకు పనిచేయదని ప్రకటన వెలువడింది. ఈ నెల 30న ఇంటర్వ్యూకు దరఖాస్తు చేసుకున్న వారి ఈ-మెయిల్, సెల్‌ఫోన్‌కు తదుపరి ఇంటర్వ్యూ నిర్వహించే తేది తెలియ జేసినట్లు చెన్నై మండల పాస్‌పోర్ట్ కార్యాలయం తెలిపింది.

8 మంది జాలర్ల అరెస్ట్

పెరంబూర్, ఆగస్టు 27: సరిహద్దులు దాటారంటూ శ్రీలంక నావికాదళం రామేశ్వరానికి చెందిన 8 మంది జాలర్లను అరెస్ట్ చేసింది. సోమవారం రామేశ్వరం ఫిషింగ్ హార్బర్ నుంచి సుమారు 5,000 మంది జాలర్లు చేపల వేటకు వెళ్లారు. వారు ధనుష్కోటి-తలైమన్నార్ సముద్ర ప్రాంతాల్లో చేపలను వేటాడుతున్న జాలర్లను శ్రీలంక నావికాదళం చుట్టుముట్టింది. సరిహద్దులు దాటి చేపలు పడుతున్నారని ఆరోపిస్తూ 8 మంది జాలర్లను అరెస్ట్ చేయడంతో పాటు ఓ ఫైబర్ పడవ స్వాధీనం చేసుకున్నారు. వారిని శ్రీలంక హార్బర్‌కు తరలించారు. కాగా, శ్రీలంక నావికాదళం ఆగడాలు అడ్డుకోవడంతో పాటు శ్రీలంక జైళ్లలో ఉన్న జాలర్లు, స్వాధీనం చేసుకున్న పడవలు విడిపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని జాలర్ల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

తిరుప్పూర్‌లో భూప్రకంపనలు

ఐసిఎఫ్, ఆగస్టు 27: తిరుప్పూర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం భారీ శబ్దంతో భూప్రకంపనలు ఏర్పడ్డాయి. ఈ ప్రకంపనలు నాచుపాళయం ప్రాంతంలోని డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో అమర్చిన సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ప్రకంపనలు ఏర్పడినప్పుడు దుకాణం షట్టర్, తగరం షీట్లు కుదుపులకు గురైన దృశ్యాలు నమోదయ్యాయి. గాంగేయం రోడ్డు నాచుపాళయంలో సుమారు 5 వేల మందికి పైగా నివసిస్తున్నారు. పలు గృహాల్లో ప్రకంపనలకు వస్తువులు కిందపడగా, మరికొన్ని దొర్లుకుంటూ వెళ్లాయి. దీంతో, ప్రజలు ఇళ్ల నుంచి రోడ్ల మీదకు పరుగులు తీశారు. తమ ప్రాంతంలో భారీ శబ్దంతో ఏర్పడిన ఈ ప్రకంపనలు సహజంగా ఏర్పడ్డాయా, క్వారీల్లో పేలుడు వల్ల జరిగాయా అనే సందిగ్ధంలో ప్రజల ఉండిపోయారు. ఇదే విధంగా, తారాపురంలోనూ భూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఇక్కడ ప్రకంపనలు జరిగిన ఒక గంటలో అస్సోం రాష్ట్రంలో భూ ప్రకంపనలు ఏర్పడ్డాయని, రిక్టర్ స్కేలుపై 2గా నమోదైందని రెవెన్యూ శాఖ అధికారులు తెలిపారు.

నగర రోడ్లపై పెలికాన్ క్రాసింగ్

అడయార్, ఆగస్టు 27: చెన్నై మహానగరంలోని రహదారులు, సిగ్నల్ వద్ద పాదాచారులు సురక్షితంగా దాటుకునేందుకు వీలుగా పెలికాన్ క్రాసింగ్‌లను ఏర్పాటు చేస్తామని చెన్నై నగర పాలక సంస్థ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ, పెలికాన్ క్రాసింగ్ ఏర్పాటు పనులు రాజా అన్నామలై శాలై, పూందమల్లి శాలైలో ప్రారంభించినట్టు తెలిపారు. డాక్టర్ నాయర్ శాలై - పూందమల్లి హైరోడ్డు, రిథర్డన్ శాలై - పూందమల్లి హైరోడ్డు, అన్నా ఆర్చి కూడలిలో పాదాచారులు సులభంగా రోడ్డు దాటే లా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఈ పెలికాన్ క్రాసింగ్‌లు అమల్లోకి వస్తే పాదాచారులు, వాహన చోదకుల భద్రత సౌకర్యాలు మెరుగుపడుతాయని భావిస్తున్నామన్నారు. పాదాచారులు సులభంగా రోడ్డు దాటాలంటే పచ్చ రంగు బటన్ నొక్కి దాటవచ్చన్నారు. అయితే, ఆ మార్గంలో వచ్చే వాహనాల సంఖ్య, ట్రాఫిక్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే పాదాచారులు రోడ్డు దాటుకునేందుకు వీలుగా గ్రీన్‌లైట్ వెలుగుతుందన్నారు. అయితే, ఈ పెలికాన్ క్రాసింగ్‌లు వీఐపీల రాకపోకలు ఉన్న సమయంలో పనిచేయవని ఆయన వెల్లడించారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

అడయార్, ఆగస్టు 27: ఒడిశా రాష్ట్రం నుంచి చెన్నై సెంట్రల్‌కు వచ్చిన ఒక ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా తీసుకొచ్చిన గంజాయిని ఆర్పీఎఫ్‌తో కలిసి స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి చెన్నైకు భారీగా గుట్కా, గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చే రైళ్ళపై నిఘా పెట్టారు. మంగళవారం ఉదయం ఒడిశా నుంచి చెన్నై సెంట్రల్‌కు ఎక్స్‌ప్రెస్ రైలులో వచ్చిన అనుమానాస్పదంగా ఉన్న కొందరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి లగేజీ తనిఖీ చేశారు. వారిలో ఒక యువకుడి లగేజీలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ యువకుడిని కేరళ రాష్ట్రంలోని కున్నూరుకు చెందిన మహ్మద్ అన్సాఫ్ (30)గా గుర్తించారు. అడయారు మాదకద్రవ్య అక్రమ రవాణా నిరోధక విభాగం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

10 టన్నుల గుట్కా స్వాధీనం

అడయార్, ఆగస్టు 27: పూందమల్లిలో కంటైనర్ లారీలో అక్రమంగా తరలించిన 10 టన్నుల గుట్కాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి కంటైనర్ లారీ డ్రైవర్‌ను అరెస్టు చేశారు. పూందమల్లి సహ పరిసర ప్రాంతాల్లో నిషేధిత గుట్కా వినియోగం జరుగుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అటువైపు వచ్చే వాహనాను తనిఖీ చేశారు. ఈ క్రమంలో పూందమల్లి - బెంగళూరు జాతీయ రహదారిలో పారివాక్కం వద్ద మంగళవారం ఉదయం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో వచ్చిన ఒక కంటైనర్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, అందులో 10 టన్నుల గుట్కాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కంటైనర్ లారీ డ్రైవర్ విఘ్నేష్ (28)ను పోలీసులు అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఫ్లాట్‌ఫాం-రైలు మధ్య చిక్కుకున్న వ్యక్తి

- కాపాడిన పోలీసులు, ప్రయాణికులు



చిక్కుకున్న వ్యక్తిని రక్షిస్తున్న దృశ్యం

పెరంబూర్, ఆగస్టు 27: రైల్వేస్టేషన్‌లోని ఫ్లాట్‌ఫారం-రైలు మధ్య చిక్కుకున్న రైల్వే మాజీ అధికారిని రైల్వే పోలీసులు, ప్రయాణకులు రక్షించారు. తిరుచ్చి కరుమండపం విశ్వదాస్ నగర్‌కు చెందిన జయచంద్రన్ మాజీ రైల్వే ఉద్యోగి. ఆయన మంగళవారం కారైకుడి నుంచి చెన్నై వెళ్లే పల్లవన్ ఎక్స్‌ప్రెస్‌లో తిరుచ్చి వచ్చారు. రైలు నెమ్మెదిగా ఫ్లాట్‌ఫారంపైకి వస్తున్న సయమంలో, జయచంద్రన్ రైలు నుంచి ఫ్లాట్‌ఫారంపైకి దూకినట్లు సమాచారం. ఊహించని విధంగా అతను ఫ్లాట్‌పారం-రైలు మధ్య చిక్కుకుపోయాడు. గమనించిన సహచర ప్రయాణికులు కేకలు వేయడంతో ఫ్లాట్‌ఫారంపై ఉన్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకొని, జయచంద్రన్‌ను రక్షించారు. స్వల్పగాయాలైన ఆయనను ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని బాలుడి ఆత్మహత్య



మృతుడు వెట్రివేల్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, ఆగస్టు 27: దిండివనం సమీపం ఊరల్ గ్రామంలో, తల్లిదండ్రులు ఖరీదైన సెల్‌ఫోన్ కొనివ్వలేదని ప్లస్ వన్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దిండివనం ఎయిడెడ్ పాఠశాలలో చదువుతున్న వెట్రివేల్, తనకు ఖరీదైన సెల్‌ఫోన్ కొనివ్వాలని తల్లిదండ్రులను కొద్దిరోజులుగా కోరుతున్నాడు. దానికి తల్లిదండ్రులు నిరాకరిస్తుండడంతో మనస్తాపం చెందిన వెట్రివేల్, తమతోటలో పశువులకొట్టంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

లంక నావికాదళం దాడులు నిరసిస్తూ ఆందోళన



ఆందోళనలో నేతలు, కార్యకర్తలు

వేలూరు, ఆగస్టు 27: రాష్ట్ర జాలర్లపై శ్రీలంక నావికాదళం అమానుష దాడులు నిరసిస్తూ మంగళవారం ఆందోళన చేపట్టారు. తమిళగ మక్కల్ జననాయక పార్టీ అధ్యక్షుడు షరీఫ్ నేతృత్వంలో కార్యకర్తలు శ్రీలంక వాసులకు చెందిన థామ్‌లోని ఫర్నిచర్ దుకాణాన్ని చుట్టుముట్టి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ... లంక నావికాదళం కాల్పుల్లో 650 మంది రాష్ట్ర జాలర్లు మృతిచెందారని, ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర జాలర్లపై జరుగుతున్న దాడులను అడ్డుకొనేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళనలో మే 17 ఇయక్కం ఆర్గనైజర్ తిరుమురుగన్ గాంధీ, విడుదలై తమిళపులుల పార్టీ అధ్యక్షుడు కుళంధై అరసన్ సహా పలువురు నేతలు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానం ఆమోదించలేదనీ..

రూ.573 కోట్లు నిలిపివేసిన కేంద్రం

- వచ్చే నెలలో టీచర్ల జీతాలు కష్టమే!

అడయార్, ఆగస్టు 27: కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టగా, దీనికి రాష్ట్రంలో అమలు చేసేందుకు డీఎంకే ప్రభుత్వం ససేమిరా అంటోంది. దీంతో సమగ్ర శిక్షా అభియాన్ పథకం కింద రాష్ట్రానికి రావాల్సిన రూ.573 కోట్లను కేంద్రం విడుదల చేయలేదు. ఆ కారణంగా సమగ్ర శిక్షా అభియాన్ పథకం కింద పనిచేసే ఉపాధ్యాయులకు వచ్చే నెల వేతనాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఈ విద్యా విధానం పథకంలో 2024-25 సంవత్సరానికిగాను రూ.3,586 కోట్లను రాష్ట్రానికి కేటాయింపులు జరిగాయి. ఇందులో కేంద్ర వాటా 60 శాతం. అంటే రూ.2,152 కోట్లు. రాష్ట్రం వాటా 40 శాతం. అంటే రూ.1,434 కోట్లు. కేంద్రం తన వాటా నిధులను యేడాదిలో నాలుగు దఫాలుగా మంజూరు చేస్తుంది. ఆ ప్రకారంగా 2024-25 సంవత్సరానికిగాను తొలి దఫా నిధులు జూన్‌లోనే విడుదల చేయాలి. కానీ ఇప్పటివరకు విడుదల చేయలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కేంద్రానికి పలుమార్లు లేఖలురాసినా ఎలాంటి స్పందన లేదు. ఈ కారణంగా వచ్చే నెలలో ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఇదే విషయంపై పాఠశాల విద్యాశాఖకు చెందిన అధికారులు మాట్లాడుతూ, గత కొన్ని నెలలుగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే సమగ్ర శిక్షా అభియాన్ పథకం పనిచేస్తుందన్నారు. అయితే, కేంద్ర ప్రభుత్వం నిధుల వాటా లేకుండా ఈ పథకాన్ని కొనసాగించడం ఒక సవాలుగా మారిందన్నారు. జూలైలో ఢిల్లీలో జరిగిన సమావేశంలో పీఎం శ్రీ పథకం కొత్త పాఠశాలల ఏర్పాటుకు సంబంధించిన ఒప్పంద పత్రాలపై సంతకం చేయాలని ఒత్తిడి చేశారన్నారు. పీఎం శ్రీ స్కూల్స్ ఏర్పాటు అనేది కొత్త జాతీయ విద్యా విధానంలో ఒక భాగమన్నారు. దీంతో రాష్ట్రం ఆ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేయలేదన్నారు. పీఎం శ్రీ పాఠశాలల్లో త్రిభాషా విధానాన్ని ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అలాగే, ఈ ఒప్పందం మేరకు 5+3+3+4 అనే పాఠ్య ప్రణాళిక కూడా అమలు చేయాల్సి ఉంటుందన్నారు. 1965లో జరిగిన హిందీ భాషా వ్యతిరేక ఉద్యమం నుంచి రాష్ట్ర ప్రభుత్వం ద్విభాషా విధానాన్ని అమలు చేస్తుందన్నారు. అదేసమయంలో రాష్ట్రంలో కొత్తగా విద్యా విధానం రూపకల్పన కోసం ఢిల్లీ హైకోర్టుకు చెందిన మాజీ న్యాయమూర్తి టి.మురుగేశన్ సారథ్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీ ఇచ్చిన నివేదికలో త్రిభాషా విద్యావిధానాన్ని వ్యతిరేకించింది. అలాగే, 3, 5, 8 తరగతులకు పబ్లిక్ పరీక్షలను నిరాకరించింది. తమిళనాడు తరహాలోనే కేరళ, వెస్ట్ బెంగాల్, ఢిల్లీ, పంజాబ్ తదితర ప్రభుత్వాలు కూడా కొత్త జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ కారణంగా సమగ్ర శిక్షా అభియాన్ పథకం కింద విడుదల చేయాల్సిన నిధులను రిలీజ్ చేయలేదని వారు పేర్కొన్నారు.

'జీరో యాక్సిడెంట్ డే'పై అవగాహన

ఐసిఎఫ్, ఆగస్టు 27: నగరంలో జీరో యాక్సిడెంట్ డే పై ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. వాహన చోదకులకు ప్రమాదాలపై అవగాహన కల్పించేలా జీరో యాక్సిండ్ డే (జడ్ఏడీ) పేరుతో ఈ నెల 5వ తేది నుంచి 20 రోజులుగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. సోమవారం సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. అలాగే, అత్యవసర పరిస్థితుల్లో కూడా ఓవర్‌స్పీడ్ వెళ్లరాదని వాహనచోదకులకు హితవు పలికారు. ఈ అవగాహన కార్యక్రమాలు కొనసాగించనున్నట్లు నగర ట్రాఫిక్ విభాగం పోలీసులు తెలిపారు.

చిత్రజ్యోతి

మా ఇంట పెళ్లికి రండి


కమల్‌కు పెళ్లి పత్రిక అందజేస్తున్న తిరునావుక్కరసర్

విశ్వనటుడు కమల్ హాసన్‌కు కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి ఎస్.తిరునావుక్కరసర్ తన కుమారుడి పెళ్ళి ఆహ్వాన పత్రికను అందజేశారు. తిరునావుక్కరసర్ రెండో కుమారుడు సాయివిష్ణుకు హీరోయిన్ మేఘా ఆకాష్‌తో వచ్చే నెల 15న వివాహం జరుగనుంది. ఈ పెళ్ళికి హాజరై వధూవరులను ఆశీర్వదించాలని విశ్వనటుడిని మంగళవారం ఆయన నివాసంలో కలుసుకున్న తిరునావుక్కరసర్ ఆహ్వాన పత్రిక అందజేశారు. కాగా, మేఘా ఆకాష్ - సాయి విష్ణు గత కొంతకాలంగా ప్రేమలో ఉన్న విషయం తెల్సిందే. వీరిద్దరు తమ పెద్దల అనుమతితో త్వరలోనే వివాహం చేసుకోనున్నారు. ఇటీవలే వీరి నిశ్చితార్థం కూడా జరిగింది.

సినిమా అనేది ప్రేక్షకుడి మనసుకి
దగ్గరగా ఉండాలి

● 'కెవి' ప్రెస్‌మీట్‌లో దర్శకుడు అమీర్


'కెవి'లో షీలా రాజ్‌కుమార్, అథవన్

ఒక చిత్రం మాస్ ఆడియన్స్‌కు దగ్గరగా ఉన్నపుడు అది విజయవంతమవుతుందని దర్శక నటుడు అమీర్ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ చిత్రోత్సవాల కోసం నిర్మించిన ఒక చిత్రాన్ని సాధారణ చిత్రాలతో పోటీపడి రిలీజ్ చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్న అమీర్.. మారి సెల్వరాజ్ రూపొందించిన 'వాళై' చిత్రానికి హీరో శివకార్తికేయన్ నిర్మించిన 'కొట్టుకాళి' చిత్రానికి ఏమాత్రం పోలిక లేదన్నారు. తమిళ్ దయాళన్ దర్శకత్వం వహించిన 'కెవి' చిత్ర బృందం సోమవారం నగరంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఇందులో అమీర్ మాట్లాడుతూ, ' సినిమా అంటే ప్రేక్షకులపై ప్రభావం చూపాలి. సినిమా షూటింగ్‌లో ప్రతి యూనిట్ కష్ట పడటం సహజం. వాటితో ప్రేక్షకులకు సంబంధం లేదు. సినిమా బాగుందా? లేదా? ఆ సినిమా తమ మనసులను కదిలించిందా? లేదా? అన్నది మాత్రమే ఆడియెన్స్ చూస్తారు. తాజాగా విడుదలైన 'వాళై', 'కొట్టుకాళి' చిత్రాలనే తీసుకోండి.. 'వాళై' మాస్ ఆడియెన్స్‌కు చాలా దగ్గరగా ఉంది కాబట్టే సక్సెస్ సాధించింది. 'కొట్టుకాళి' ఫెస్టివల్స్ కోసం తీసిన ది. దాన్ని ఒక సాధారణ సినిమాగా భావించి రిలీజ్ చేయడం నాకు ఆమోదయోగ్యం కాదు. నేనుగానీ ఈ సినిమా తీసివుంటే థియేటర్‌లో విడుదల చేసేవాడిని కాదు. శివకార్తికేయన్ తనకున్న స్టార్ ఇమేజ్‌తో ఏదో ఒక ఓటీటీకి విక్రయించి పెట్టుబడి రాబట్టుకోవచ్చు. ఇక ఈ చిత్రం 'జైభీమ్' తరహాలో ప్రజాదారణ పొందాలి. ఈ సినిమా ఒక మంచి సమస్యకు పరిష్కారం చూపిస్తుందని భావిస్తున్నానన్నారు. కాగా, 'కెవి' చిత్రంలో షీలా రాజ్‌కుమార్, జాక్వెలిన్ లిడియా, ఆధవన్ ప్రధాన పాత్రలు పోషించగా, గౌతం చొక్కలింగం అద్వగ్ ప్రొడక్షన్ పతాకంపై నిర్మించారు.

యోగిబాబు, లక్ష్మీమేనన్ కాంబినేషన్‌లో 'మలై'


'మలై'లో యోగిబాబు - లక్ష్మీమేనన్

'బ్లూస్టార్' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన లెమన్ లీఫ్ సంస్థ తాజాగా ప్రముఖ హాస్య నటుడు యోగిబాబు, నటి లక్ష్మీ మేనన్ ప్రధాన పాత్రల్లో 'మలై' అనే చిత్రాన్ని తెరకెక్కించింది. వచ్చే నెలలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం ప్రచార కార్యక్రమాలను మొదలుపెట్టింది. నూతన దర్శకుడు ఐపీ మురుగేష్ డైరెక్ట్ చేయగా, ఆర్.గణేశ్ మూర్తి, సౌందర్య గణేశ్ నిర్మించారు. ఇతర పాత్రల్లో కాళీ వెంకట్, బాలనటుడు చతుర్థి గణేశమూర్తి తదితరులు నటించారు. ఈ సినిమా వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'మానవ జీవితం ప్రకృతితో ముడిపడివుంటుంది. మనుషుల వలే జంతువులు, మొక్కలు, పర్వతాలు, నదులు, నీటి వనరులు ఈ భూమిపై చాలా ముఖ్యమైనవి. మానవుల స్వార్థానికి ప్రకృతి నాశనం అయిపోతోంది. తాము చేసే దురాగతాల నుంచి తప్పించుకోవడానికి అధికారం, రాజకీయం, కులం, మతం, జాతి వంటి వాటిని అడ్డు పెట్టుకుంటున్నారు. సాటి వారిపై ప్రేమ మరిచి, భవిష్యత్ తరాల జీవితాల గురించి ఏమాత్రం ఆలోచన లేని దురాశ ప్రకృతి వినాశనానికి దారితీస్తుంది. ఇలాంటి ఒక మంచి కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. డి.ఇమ్మాన్ సంగీతం అందించగా, త్వరలోనే పాటలను త్వరలోనే విడుదల చేస్తాం' అని పేర్కొన్నారు.

అనారోగ్యంతో కమెడియన్ 'బిజిలి' రమేష్ మృతి


'బిజిలి' రమేష్ (ఫైల్‌ఫొటో)

తమిళ చిత్రపరిశ్రమకు చెందిన హాస్య నటుడు 'బిజిలి' రమేష్ (45) అనారోగ్యం కారణంగా సోమవారం రాత్రి 9.45 గంటల సమయంలో మృతి చెందారు. ఎంజీఆర్ నగర్ పుహళేంది వీధి, శూలైపల్లంలో ఉన్న ఆయన నివాసంలో పార్థివదేహాన్ని ఉంచగా, కోలీవుడ్‌కు చెందిన సహ నటీనటులు, అభిమానులు నివాళర్పించారు. మంగళవారం సాయంత్రం శూలై పల్లం సత్యానగర్‌లోని శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు. బిజిలి రమేష్ యూట్యూబ్ వీడియోల ద్వారా గుర్తింపు పొందారు. ఈ క్రమంలో నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించిన 'కోలమావు కోకిల' చిత్రం ద్వారా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి.. 'నట్పే తుణై', 'శివప్పు మంజల్ పచ్చై' 'కోమాలి', 'ఆడై' వంటి చిత్రాల్లో నటించారు. ఈ నేపథ్యంలో గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక సాయం చేయాలంటూ విజ్ఞప్తి కూడా చేశారు. కాగా, ఆయన మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపం సానుభూతి తెలిపారు.

వీఐటీ వర్సిటీలో కలైంజర్‌కు ఘననివాళి



మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి ముగింపు వేడుకల్లో పాల్గొన్న వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్, మంత్రి దురైమురుగన్, ఎంపీ కనిమొళి తదితరులు

వేలూరు, ఆగస్టు 27: వీఐటీ యూనివర్సిటీలో సోమవారం తమిళ్ సమాఖ్య, పావేందర్ తమిళ్ మండ్రం సంయుక్త ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి వేడుకల ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వర్సిటీ చాన్సలర్ విశ్వనాథన్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్, చేనేత శాఖ మంత్రి గాంధీ, పురపాలక శాఖ మంత్రి ఏవీ వేలు, పార్లమెంట్ కమిటీ అధ్యక్షురాలు కనిమొళి, ఎంపీ కదిర్ ఆనంద్, సినీ గేయరచయిత వైరముత్తు పాల్గొని, కరుణానిధి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కరుణానిధితో పనిచేసిన వారికి వీఐటీ చాన్సలర్ విశ్వనాథన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ కనిమొళి మాట్లాడుతూ... దివంగత ముఖ్యమంత్రి కరుణానిధి తన జీవితంలో స్నేహితుడు, ఫిలాసఫర్, గైడ్, హీరో, తండ్రిగా వ్యవహరించారన్నారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములను ఆయన ఒకలాగే చూసేవారని తెలిపారు. దేశంలోనే హిజ్రాలను మూడో వర్గంగా గుర్తించిన కలైంజర్, వారికి గుర్తింపుకార్డు, రేషన్ కార్డు అందజేశారని, అలా అన్నివర్గాల అభివృద్ధికి కృషిచేసిన వ్యక్తిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. కరుణానిధి చూపిన బాటలోనే ప్రస్తుతం ముఖ్యమంత్రి స్టాలిన్ పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీలు కదిర్ ఆనంద్, జగద్రక్షకన్, మురసోలి సెల్వం, ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, ఈశ్వరప్పన్, అమ్ములు, వేలూరు మేయర్ సుజాత ఆనందకుమార్, తమిళ సమాఖ్య జనరల్ సెక్రటరీ వనంగాముడి, కేంద్ర సెక్రటరీ సుకుమార్, కోశాధికారి పదుమారన్, వీఐటీ వర్సిటీ ఉపాధ్యక్షులు శంకర్, శేఖర్, సెల్వం తదితరులు పాల్గొన్నారు.

నమిత బాధ పడితే క్షమాపణ చెబుతాం

● మంత్రి పీకే శేఖర్‌బాబు


గంగాధీశ్వరాలయంలో జీర్ణోద్ధరణ పనులు పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు

చెన్నై, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): మదురై మీనాక్షి ఆలయంలో సోదరి నమిత మనసుకు బాధకలిగించే విషయాలు జరిగి ఉంటే తాము క్షమాపణ చెబుతామని దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రకటించారు. నగరంలోని పురుషవాక్కం గంగాధీశ్వరాలయంలో రూ.3.86 కోట్లతో జరుగుతున్న జీర్ణోద్ధరణ పనులను మంగళవారం ఉదయం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఆ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ గతంలో పళని దేవాలయంలో ఇలాంటి సంఘటనకు సంబంధించిన కేసులో వెలువడిన తీర్పు ప్రకారం నమిత ముస్లిం మతానికి చెందినవారై ఉంటారనే సందేహంతో ఆలయ సిబ్బంది అలా ప్రవర్తించి ఉంటారని భావిస్తున్నామన్నారు. నమితకు ఎదురైన సంఘటపై కమిషనర్ విచారణకు ఆదేశించారని, సోదరి నమిత మనస్సుకు బాధకలిగి ఉంటే లేదా అవాంఛనీయంగా చట్ట వ్యతిరేకంగా ఏదైనా జరిగి ఉంటే ఆ విషయాలపై సమగ్రంగా విచారణ జరిపి కఠిన చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేల సంఖ్యలో ప్రాచీన, సుప్రసిద్ధ ఆలయాల్లో మరమ్మతులు చేపట్టి, మహా కుంభాభిషేకాలు నిర్వహించిందని, ఆ రీతిలోని పురుషవాక్కం గంగాధీశ్వరాలయంలో రూ.81 లక్షలతో కొయ్య రథాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. మంత్రితోపాటు దేవాదాయ శాఖ కమిషనర్ పీఎన్ శ్రీధర్, డిప్యూటీ కమిషనర్ ఐ.ముల్లై, ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ వెట్రికుమార్, ఆలయ కార్యనిర్వహణాధికారి రామరాజా తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు రేషన్ కార్డు అందజేస్తున్న మంత్రి చక్రపాణి

కొత్తగా 15.94 లక్షల మందికి రేషన్ కార్డులు

● ఆహార శాఖ మంత్రి చక్రపాణి

పెరంబూర్, ఆగస్టు 27: రాష్ట్రంలో ఇప్పటివరకు 15,94,321 కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు ఆహార శాఖ మంత్రి చక్రపాణి తెలిపారు. దిండుగల్ జిల్లా ఒట్టాన్‌సత్రం నియోజకవర్గంలో కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారికి కార్డులు అందించే కార్యక్రమం ఒట్టాన్‌సత్రంలో సోమవారం జరిగింది. జిల్లా కలెక్టర్ ఎంఎన్ పూంగొడి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో మంత్రి చక్రపాణి పాల్గొని, 52 మందికి కొత్త రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... డీఎంకే అధికారం చేపట్టిన 38 నెలల్లో ఇప్పటివరకు 15,94,321 మందికి కొత్త రేషన్ కార్డులు అందజేశామన్నారు. అలాగే, మరో 2,89,591 మంది రేషన్ కార్డులు కోరుతూ దరఖాస్తు చేసుకున్నారని, వాటిని పరిశీలించి త్వరలోనే అర్హులైన వారికి కార్డులు అందజేయనున్నామని తెలిపారు. చిరుధాన్యాల విక్రయాలకు 100 ప్రాంతాల్లో అముదం దుకాణాలు ప్రారంభించనున్నామన్నారు.

కానిస్టేబుళ్ల ఎంపిక కోసం
దేహదారుఢ్య పరీక్షలు


ఓ అభ్యర్థి ఛాతీ కొలతను పరిశీలిస్తున్న పోలీసు అధికారి - పరుగులు తీస్తున్న అభ్యర్థులు


అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

చెన్నై, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూరు రాజరత్తినం స్టేడియంలో పోలీసు కానిస్టేబుళ్ల రాత పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం ఉదయం దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు ఈ నెల 30 వరకు నిర్వహించనున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. నాలుగురోజులపాటు జరగనున్న ఈ దేహదారుఢ్య పరీక్షలకు 1165 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. మంగళవారం ఉదయం ప్రారంభమైన ఈ పరీక్షలో అభ్యర్థులకు పరుగు పందెం, ఛాతీ , ఎత్తు కొలతలు చేపట్టారు. దేహదారుఢ్య పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు తగిన వసతులు కూడా కల్పించినట్లు అధికారులు తెలిపారు.

హిమాచల్
ఆపిల్ సీజన్ ప్రారంభం

ఐసిఎఫ్, ఆగస్టు 27: నగరంలో హిమాచల్ ఆపిల్ సీజన్ ప్రారంభమైంది. దేశంలో కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాంచల్, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, పంజాబ్, సిక్కిం రాష్ట్రాల్లో ఆపిల్స్ ఎక్కువగా పండుతుంటాయి. వీటిలో హిమాచల్ ప్రదేశ్, కశ్మీర్ ఆపిల్స్‌కు ప్రత్యేక రుచి ఉంటాయి. ఆగస్టు నుంచి డిసెంబరు వరకు ఆపిల్ సీజన్. సీజన్‌లేని కాలంలో న్యూజిలాండ్, చైనా, అమెరికా, ఇటలీ, చిలీ, టర్కీ, ఆఫ్ఘనిస్తాన్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటారు. ప్రస్తుతం హిమాచల్ నుంచి కోయంబేడు మార్కెట్‌కు ఆపిల్లు దిగుమతవుతున్నాయి. కిలో మొదటి రకం రూ.175, రెండో రకం రూ.150కు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు.





31న చెన్నై-నాగర్‌కోయిల్ మధ్య వందేభారత్ రైలు

● ప్రారంభించనున్న ప్రధాని

పెరంబూర్, ఆగస్టు 27: చెన్నై-నాగర్‌కోయిల్ మధ్య వందే భారత్ రైలు సేవలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 31న ప్రారంభించనున్నట్లు దక్షిణ రైల్వే వర్గాలు తెలిపాయి. దేశ ప్రధానిగా మూడో సారి బాధ్యతలు చేపట్టిన మోదీ జూన్ 20వ తేది నగరానికి వస్తారని ప్రకటించారు. ప్రధాని నగర పర్యటనలో భాగంగా వందే భారత్ రైలు సహా, దక్షిణ రైల్వేలో పలు పథకాలు ప్రారంభిస్తారని ప్రకటించారు. సెంట్రల్ రైల్వేస్టేషన్ లో ఈ కార్యక్రమం కోసం రైల్వే, పోలీసు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. కానీ, అనివార్య కారణాలతో ప్రధాని పర్యటన రద్దయింది. ఈ నేపథ్యంలో, ఈ నెల 31న చెన్నై-నాగర్‌కోయిల్ వందే భారత్ రైలు సేవలను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. ఈ విషయమై దక్షిణ రైల్వే అధికారి ఒకరు మాట్లాడుతూ.... చెన్నై-నాగర్‌కోయిల్ మధ్య డైలీ వందే భారత్ రైలు, బెంగళూరు-మదురై వందే భారత్ రైలు సేవలను 31న ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తారని, అలాగే, మరికొన్ని పథకాలు కూడా ప్రధాని ప్రారంభించనున్నారని, ఏఏ పథకాలు ప్రారంభిస్తారు అనే వివరాలు మరో రెండు రోజుల్లో అధికారపూర్వకంగా తెలుస్తాయని ఆయన తెలిపారు.

అపోలో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో
ఫాంటాన్ విధానంలో చికిత్స



కోలుకున్న చిన్నారులతో అపోలో హాస్పిటల్స్ ఎండీ సునీతారెడ్డి, డాక్టర్ నెవిల్లే ఏజీ సాల్మన్, డాక్టర్ సీఎస్ ముత్తుకుమారన్ తదితరులు

చెన్నై, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అపోలో చిల్డ్రన్స్ హాస్పిటల్ చిన్నారులకు శస్త్రచికిత్స లేకుండా ప్రత్యామ్నాయ ఫాంటాన్ విధానానం ద్వారా హృద్రోగ చికిత్స చేసి సరికొత్త రికార్డు నెలకొల్పిందని అపోలో హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ సునీతారెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం అపోలో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో హృద్రోగ చికిత్స చేసుకుని కోలుకున్న చిన్నారుల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపోలో చిల్డ్రన్స్ హాస్పిటల్ హృద్రోగ చికిత్సా విభాగాధిపతిగా ఉన్న డాక్టర్ నెవిల్లే ఏజీ సాల్మన్, డాక్టర్ సీఎస్ ముత్తుకుమారన్ సమష్టి కృషి వల్లే చిన్నారులకు హృద్రోగ చికిత్స అందించి వారిని ప్రాణాపాయం నుంచి రక్షించగలిగామని తెలిపారు. ఇప్పటివరకూ 6500 ఓపెన్‌హార్ట్ సర్జరీలు, 10133 ప్రత్యామ్నాయ హృద్రోగ చికిత్సలు చేసి అపోలో చిల్డ్రన్స్ హాస్పిటల్ చిన్నారులకు అంతర్జాతీయ ప్రమాణాలతో చికిత్స చేసే స్థాయికి ఎదిగిందని చెప్పారు. ఈ సమావేశంలో డాక్టర్ ఆర్కే వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారు మోటర్స్ నుంచి
'ప్రణ 2.0' ఎలక్ట్రిక్ టూ వీలర్



టూవీలర్ ఆవిష్కరణ దృశ్యం

చెన్నై, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీవారు మోటర్స్ సంస్థ ఇటీవల 'ప్రణ 2.0' ఎలక్ట్రిక్ టూవీలర్ ఆవిష్కరించింది.ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు మోహన్‌రాజ్ రామస్వామి, శాస్త్రవేత్త డాక్టర్ మయిల్‌స్వామి అన్నాదురై, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ యువరాజ్ శంకర్, సంస్థ డైరెక్టర్ సెల్వరాజ్ కృష్ణన్, చెల్లప్పన్ రామస్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ బైక్ ప్రారంభ ధర రూ.2,55,150గా నిర్ణయించినట్లు నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

రూ.20 కోట్లతో హుమయూన్ మహల్ పునరుద్ధరణ



ఐసిఎఫ్, ఆగస్టు 27: పురావస్తు పరిశోధన శాఖ ఆధీనంలో ఉన్న హుమయూన్ మహల్‌ను రూ.20 కోట్లతో పునరుద్ధరించనున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు. మెరీనాలోని శ్రామికుల విగ్రహం సమీపంలో ఉన్న ఎలిళగం ప్రాంగణంలోని హుమయూన్ మహల్ 250 ఏళ్ల క్రితం నిర్మితమైంది. ఇటీవల ఈ మహల్ పర్యవేక్షణ పురావస్తు పరిశోధన శాఖకు ప్రభుత్వం అప్పగించింది. ఈ నేపథ్యంలో, రూ.20 కోట్లతో పునరుద్ధరణ పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

వేషధారణ పోటీ విజేతలకు బహుమతులు


వేషధారణలో చిన్నారులు

ఐసిఎఫ్, ఆగస్టు 27: శ్రీకృష్ణ జయంతిని పురస్కరించుకొని తండయార్‌పేట నెహ్రూ నగర్ రామాలయంలో నిర్వహించిన వేషధారణ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ప్రతి ఏటా ఈ ఆలయంలో కృష్ణ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం, సోమవారం పండుగను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో యువతీ, యువకులు, చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించారు. కృష్ణుడు, రుక్మిణి, సత్యభామ, రాధ, గోపికల వేషధారణతో పోటీల్లో పాల్గొన్న చిన్నారులకు చెరుకూరి సుబ్బారావు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహక కమిటీ అధ్యక్షులు బాలాజీ, కోశాధికారి ప్రకాష్‌బాబు, స్థానికులు పాల్గొన్నారు.

చెన్నై మెట్రోరైలు ఫేజ్-2 ...
బండరాళ్లు దాటిన 'కావేరి యంత్రం'


అడయార్ జంక్షన్‌లో మెట్రో పనులు

పెరంబూర్, ఆగస్టు 27: రెండో విడత మెట్రోరైలు పథకంలో భాగంగా మూడో మార్గంలో గ్రీన్‌వేస్ రోడ్డు-అడయార్ జంక్షన్ మధ్య సొరంగం తవ్వుతున్న 'కావేరి' యంత్రం బలమైన బండరాళ్లను దాటిందని అధికారులు తెలిపారు. మెట్రో రైలు రెండో విడతలో మూడు మార్గాల్లో 116.1 కి.మీ మేర మెట్రోరైలు మార్గం పనులు వివిధ దశల్లో జరుగుతున్నాయి. మాధవరం-సిరుచ్చేరి సిప్కాట్ మధ్య 45.4 కి.మీ మేర మూడో మార్గం ఏర్పాటవుతోంది. ఈ మార్గంలో గ్రీన్‌వేస్ రోడ్డు నుంచి అడయార్ జంక్షన్ వరకు 1.226 కి.మీ మేర సొరంగ మార్గం తవ్వకాలు గత ఏడాది ఫిబ్రవరి 16న ప్రారంభమయ్యాయి. మొదటి సొరంగం పనులను 'కావేరి', రెండో సొరంగం తవ్వకాలను 'అడయార్' అనే యంత్రాలు చేపడుతున్నాయి. ఈ యంత్రాలు అడయార్ నది దాటాయి. వీటిలో మొదటి సొరంగం తవ్వే కావేరి రెండు నెలల క్రితం అడయార్ ఫ్లై ఓవర్ కింద భారీ బండరాళ్ల నడుమ పనులు ప్రారంభించింది. ప్రస్తుతం ఆ పనులను విజయవంతంగా పూర్తిచేసిందని సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు. అడయార్ ప్రాంతంలో భూగర్భంలో మట్టి, పెద్ద పెద్ద బండరాళ్లున్నాయని, అందువల్ల యంత్రం డిగ్గింగ్ టూల్స్ నిరంతరం భర్తీ చేయాల్సి ఉన్నందున ఈ పనులు సవాలుగా మారాయన్నారు. కావేరి మైనింగ్ ఎక్స్‌కవేటర్ రెండు నెలలుగా బలమైన రాతి ప్రాంతంలో ఉందన్నారు. ఈ యంత్రం రోజుకు 1.5 మీటర్ల నుంచి 2 మీటర్ల వరకు డ్రిల్లింగ్ చేసిందని తెలిపారు. ప్రస్తుతం యంత్రం రాతి ప్రాంతాలను దాటిందన్నారు. ఇంకా ఈ యంత్రం 190 మీటర్ల సొరంగం తవ్వాల్సి ఉందని, వచ్చే నెలాఖరు నాటికి యంత్రం అడయార్ జంక్షన్ చేరుకుంటుందని తెలిపారు.